సబ్సిడీతో మ్యాంగో ఫ్రూట్ కవర్లు

పీలేరు రూరల్ : మామిడి రైతులకు 50 శాతం సబ్సిడీతో ప్రభుత్వం మ్యాంగో ఫ్రూట్ కవర్లు ఇస్తుందని ఉద్యానశాఖ అధికారి సుకుమార్ రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని కాకులారంపల్లెలో రెడ్డెప్పరెడ్డి మామిడి తోటను పరిశీలించి చీడపీడల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మ్యాంగో ఫ్రూట్ కవర్లు కావలసిన రైతులు సమీపంలోని రైతు సేవ కేంద్రంలో సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని కోరారు. పట్టాదారు పాసుపుస్తకం, 1బీ జిరాక్స్, బ్యాంక్ అకౌంట్, ఆధార్‌కార్డు, పాసుపోర్టు సైజు ఫోటోతో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఒక్కో రైతుకు గరిష్ఠంగా రూ. 10 వేలు సబ్సిడీ వర్తిస్తుందని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నూతన వధూవరులకు ఆశీర్వాదం

తంబళ్లపల్లె: మండలంలో కన్నెమడుగు పంచాయతీ మరిమిరెడ్డిగారిపల్లెలో గురువారం వైఎస్సార్‌సీపీ నాయకుడు లక్ష్మిరెడ్డి అన్న కుమారుడి వివాహ వేడుకలో ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి పాల్గొన్ని నూతన వధూవరులను ఆశీర్వదించారు. అలాగే ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన మండల ప్రత్యేక ఆహ్వానితులు పి.చిన్నరెడ్డి భార్య రెడ్డమ్మను పరామర్శించారు. ఆయన వెంట మండల పార్టీ కన్వీనర్ చౌడేశ్వర్, కె.ఆర్.మల్‌రెడ్డి, కిషోర్‌రెడ్డి, శివారెడ్డి ఉన్నారు.

రైతులందరికీ పీఎం కిసాన్ క్రెడిట్ కార్డులు

జేడీ చంద్రానాయక్



రైతులతో మాట్లాడుతున్న జేడీ

పెద్దమండ్యం: పట్టాదారు పాసుపుస్తకం కలిగిన ప్రతి రైతుకు పీఎం కిసాన్ క్రెడిట్ కార్డు (యూనిక్ ఐడీ) పొందేలా చర్యలు తీసుకుంటామని అన్నమయ్యజిల్లా వ్యవసాయశాఖ జేడీ చంద్రానాయక్ తెలిపారు. మండలంలోని పాపేపల్లె, బండ్రేవు, పెద్దమండ్యం రైతు సేవా కేంద్రాలను గురువారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పీఎం కిసాన్ క్రెడిట్ కార్డు కోసం రిజిస్ట్రేషన్‌లు జరుగుతున్న తీరును ఆయన పరిశీలించారు. పీఎం కిసాన్ క్రెడిట్ కార్డు పొందడం ద్వారా రైతులు పొందే ప్రయోజనాల గురించి వివరించారు. మండలంలో 7,200 మంది రైతులు ఉండగా, ఇప్పటి వరకు 951 మంది రైతులకు రిజిస్ట్రేషన్ పూర్తి చేసినట్లు సిబ్బంది తెలిపారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని జేడీ సూచించారు. అగ్రికల్చర్ అసిస్టెంట్‌లు సుగుణమ్మ, ధనమ్మ, సుప్రియ పాల్గొన్నారు.

కనుల పండువగా పుష్పయాగం



పుష్పయాగం కార్యక్రమంలో ఎమ్మెల్యేద్వారకనాథరెడ్డి

తంబళ్లపల్లె: మండలంలోని కోసువారిపల్లెలో వెలసిన శ్రీ ప్రసన్న వేంకటరమణస్వామి ఆలయంలో టీటీడీ ఆధ్వర్యంలో 11 రోజులుగా వైభవంగా నిర్వహించిన స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు గురువారంతో ముగిశాయి. శుక్రవారం సాయంత్రం పలు రకాల పుష్పాలతో స్వామికి పుష్పయాగం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరరెడ్డి హాజరై కార్యక్రమాన్ని తిలకించారు. కార్యక్రమంలో సర్పంచ్ విజయలక్ష్మి రఘు, వైస్ ఎంపీపీ శ్యామలమ్మ, కోటిరెడ్డి, రమణారెడ్డి, మల్లిరెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా సరోజినినాయుడు జయంతి

మదనపల్లె సిటీ: స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీలో గురువారం ప్రముఖ స్వాతంత్య్ర సమరయోధురాలు సరోజినినాయుడు 146 జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.క్రిష్ణవేణి మాట్లాడుతూ సరోజినినాయుడు స్వాతంత్య్ర సమరయోధురాలిగా, మహిళలకు ఆదర్శంగా నిలిచారని కొనియాడారు.

కేబుల్ వైర్ల చోరీ

– కేసు నమోదు

నిమ్మనపల్లె : నిమ్మనపల్లె పంచాయతీ గండిమాలపల్లెకు చెందిన రైతు కందూరి నాగరాజ బోరుబావి వద్ద మంగళవారం రాత్రి జరిగిన కేబుల్ వైర్ల చోరీపై బాధితుని ఫిర్యాదు మేరకు ఏఎస్‌ఐ ఎస్.ఏ జిల్లాని బాషా కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తిప్పేస్వామి తెలిపారు. రైతు నాగరాజకు వెంగంవారిపల్లి గ్రామంలో బుధవారం పొలం వద్దకు వెళ్లి పంటకు నీరు పెట్టడానికి మోటారు ఆన్ చేయగా పనిచేయలేదు. దీంతో కేబుల్ వైర్లను దుండగులు దొంగలించినట్లుగా గుర్తించాడు. బోరు స్టార్టర్ నుంచి బోరు మోటర్ వరకు సుమారు 200 మీటర్లు గల కేబుల్ వైరు చోరీకి గురైనట్లు ఫిర్యాదులో పేర్కొన్నాడు.

రుణాల లక్ష్యాలు సాధించాలి

పీలేరురూరల్ : నియోజకవర్గ పరిధిలో బ్యాంకర్లు రుణాల లక్ష్యాలు సాధించాలని లీడ్ బ్యాంక్ మేనేజరు ఆంజనేయులు అన్నారు. గురువారం స్థానిక వెలుగు కార్యాలయంలో నియోజకవర్గంలోని ఆరు మండలాల జాయింట్ మైక్రో లెవెల్ బ్యాంకర్స్ కమిటీ (జేఎంఎల్‌బీసీ) సమావేశం నిర్వహించారు. క్రాప్ కల్టివేటర్ రైట్ కార్డ్స్ రుణాల ప్రగతి, ప్రధానమంత్రి విశ్వకర్మ లోనింగ్ పథకం, ప్రధానమంత్రి సూర్య ఘర్ పథకాల అమలు, సైబర్ మోసాలపై అవగాహన, పశుసంవర్ధక రుణాలు ప్రగతి, పీఎం ఈజీపీ పథకం అమలు, ఐడబ్ల్యూస్ ఓబీసీ కార్పొరేషన్ లక్ష్యాల సాధన, డిపాజిట్ల ప్రచారం వంటి అంశాలపై చర్చించారు.

బహుజనులకు రాజ్యాధికారమే లక్ష్యం

బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు గౌతమ్‌కుమార్



మదనపల్లె : బహుజనులకు రాజ్యాధికార సాధనే లక్ష్యమని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు బందెల గౌతమ్‌కుమార్ తెలిపారు. బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడిగా అన్నమయ్య జిల్లా మదనపల్లెకు చెందిన బందెల గౌతమ్‌కుమార్‌ను పార్టీ అధిష్టానం నియమించింది. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో వెనుకబడిన వర్గాల ప్రజలు అన్ని రంగాల్లో రాణించాలంటే రాజకీయంగా పురోగతి సాధించాలని, బహుజనులకు రాజ్యాధికారం దక్కినపుడే ఆర్థిక, రాజకీయ, సమానత్వం, అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. సామాజిక న్యాయం అందరికీ అందాలంటే అంబేడ్కర్ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. బహుజన సమాజ నిర్మాణమే లక్ష్యంగా పనిచేస్తున్న మాజీ ముఖ్యమంత్రి మాయావతి ప్రధాని అయితే, బలహీన, పీడిత వర్గాలకు రాజ్యాధికారం లభిస్తుందన్నారు.

అడ్డంకులపై సబ్‌కలెక్టర్ ఆరా

–నేడు మరుగుదొడ్ల నిర్మాణ పనులు

బి.కొత్తకోట: స్థానిక జ్యోతిచౌక్‌లో ప్రజల సౌకర్యం కోసం నగర పంచాయతీ అధికారులు నిర్మించతలపెట్టిన మరుగుదొడ్ల పనులకు అడ్డంకులపై మదనపల్లి సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్ ఆరా తీశారు. గురువారం బి.కొత్తకోటకు వచ్చిన ఆయన దీనిపై అధికారులతో వివరాలు తెలుసుకున్నారు. బుధవారం నిర్మాణ పనులు చేపట్టగా అది తమ స్థలమని చెప్పి నిర్మాణం చేయరాదని ప్రైవేటు వ్యక్తులు అభ్యంతరం వ్యక్తం చేశారు. కమిషనర్ పల్లవి రికార్డుల ఆధారంగా స్థల వివరాలు, మరుగుదొడ్ల నిర్మాణ స్థలంపై ప్రైవేటు వ్యక్తుల అభ్యంతరాలను వివరించారు. నిర్మాణ పనులకు సహకరించాలని సబ్‌కలెక్టర్ పోలీసులను ఆదేశించినట్టు రెవెన్యూ వర్గాలు తెలిపాయి. దీనితో శుక్రవారం నగర పంచాయతీ అధికారులు నిర్మాణాలు చేపట్టనున్నారు.

15 వరకు సబ్సిడీ రుణాల గడువు పెంపు

నిమ్మనపల్లె : సబ్సిడీ రుణాల గడువు ప్రభుత్వం ఈ నెల 15వ తేదీ వరకు పొడిగించిందని ఎంపీడీఓ పరమేశ్వర్ రెడ్డి తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ నిరుద్యోగ యువత స్వయం ఉపాధి కోసం అందిస్తున్న బీసీ, ఈబీసీ, ఈడబ్ల్యూఎస్, కాపు కార్పొరేషన్ల రాయితీ రుణాలు పొందేందుకు దరఖాస్తు చేసుకునేలా ఈ నెల 15 వరకు అవకాశం కల్పించిందన్నారు. అర్హులైన వారు కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. కాగా లబ్ధిదారులకు కార్పొరేషన్ల రుణాలు 50 శాతం సబ్సిడీతో మంజూరు చేయనున్నట్లు తెలిపారు. వయస్సు 21–60 ఏళ్ల మధ్య ఉండి, తెల్ల రేషన్ కార్డు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, ఆధార్ కార్డు, బ్యాంకు బుక్, ఫోటో తో అర్హులైన వారు ఈనెల 15వ తేదీలోపు ఏపీఓబీఎంఎంఎస్ వెబ్ సైట్‌లో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.



కోర్కెలు తీర్చే కల్పవల్లి.. గంగమ్మ తల్లి

- నాలుగురోజుల పాటు జాతర
- చాందినీ బండ్లతో పండుగ శోభ
- వేలాదిగా తరలివస్తున్న భక్తులు



ప్రత్యేక అలంకరణలో సీటీఎం నలవీర గంగమ్మ

మదనపల్లె : భక్తులు కోర్కెలు తీర్చే కల్పవల్లిగా చిన్నతిప్పసముద్రం (సీటీఎం) నల్లవీర గంగమ్మ తల్లి విరాజిల్లుతోంది. నల్లవీర గంగమ్మ జాతరను నాలుగురోజుల పాటు అంగరంగ వైభవంగా నిర్వహించన్నారు. జాతరకు జిల్లా నలుమూలల నుంచే కాకుండా తమిళనాడు, కర్నాటక నుంచి పెద్దసంఖ్యలో భక్తులు వచ్చి అమ్మవారిని దర్శించుకోనున్నారు. జాతర మహోత్సవాల్లో భాగంగా బుధవారం అమ్మవారి ఆలయ ప్రవేశంతో జాతర ప్రారంభమైంది. గురువారం సిద్ధుల భుక్తి కార్యక్రమం జరిగింది. శుక్రవారం రెయ్యి తిరునాళ్లు అంగరంగవైభవంగా నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా చుట్టుపక్కల గ్రామాల ప్రజలు మొక్కులు తీర్చుకునే క్రమంలో చాందినీ బండ్లు కట్టి పిల్లనగ్రోవి, డప్పుల మోతలతో ఊరేగింపుగా తీసుకువచ్చి ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేయిస్తారు. శనివారం పగలు తిరుణాల జరుగుతుంది. కళ్ళిపాటు, అమ్మవారి ఊరేగింపు ఉంటుంది. ఆదివారం దోపు తిరనాళ్ల మొదలవుతుంది. అమ్మవారి జాతరలో దోపుతిరుణాలతో పాటుగా ఎద్దుల పరుష ప్రారంభమవుతుంది. పరుషలో పడమటి మండలాల నుంచే కాకుండా ఇతర జిల్లాల రైతులు, వ్యాపారులు వచ్చి పశువులను కొనుగోలు చేస్తారు. సీటీఎం నల్లవీర గంగమ్మ జాతరకు ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకుంటారు.

మిట్టపల్లె నుంచి పుట్టింటి సారె

గంగమ్మ పుట్టినిల్లు మిట్టపల్లె. జాతర ఉత్సవాల్లో భాగంగా మిట్టపల్లెలోని మేకల వంశస్తులు గంగమ్మకు పసుపు, కుంకుమ, చీర, సారే సమర్పిస్తారు. తొలి పూజ జరుపుకున్నాక అమ్మవారు ఆలయప్రవేశం చేస్తారు.

విపత్తుల్లోనూ ఆగని జాతర

సీటీఎం నల్లవీర గంగాభవాని జాతర 400 ఏళ్లుగా క్రమం తప్పకుండా నిర్వహిస్తున్నారు. 1947లో జాతర నిలిచిపోతే, అదే ఏడాది గ్రామంలో కలరా వచ్చి వందల సంఖ్యలో చనిపోయారని, దీంతో ప్రజలు గ్రామాన్ని వదలి సీటీఎం పెద్దచెరువు మొరవ వద్దకు వలస వెళ్లినట్లు పెద్దల కథనం. దాని తర్వాత ఇప్పటివరకు సీటీఎం జాతర నిరాటంకంగా కొనసాగుతోంది. కరోనా విపత్తులోనూ అమ్మవారి జాతర ఘనంగా జరిగింది.

మిట్టపల్లె నుంచి సారె

సీటీఎం శ్రీ నలవీర గంగమ్మ పుట్టినిల్లు మిట్టపల్లె. జాతర ఉత్సవాల్లో భాగంగా మిట్టపల్లెలోని మేకల వంశస్థులు గంగమ్మకు పసుపు, కుంకుమ, చీర, సారే సమర్పిస్తారు. తొలి పూజ జరుపుకున్నాక అమ్మవారు ఆలయప్రవేశం చేస్తారు.

ప్రత్యేక ఏర్పాట్లు

గంగమ్మ జాతర సందర్భంగా ఆలయాన్ని శోభాయమానంగా అలంకరించారు. ఆధ్యాత్మిక వాతావరణంలో భక్తులు అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులకు అవసరమైన అన్ని వసతులు కల్పించినట్లు సీటీఎం సర్పంచ్ సగినాల ఆనంద పార్థసారథి, పారపట్ల సురేంద్రరెడ్డి, పొగాకువీర ప్రతాప్, వెలుగుచంద్ర తెలిపారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకోవాలని కోరారు.



విద్యుద్దీపాల అలంకరణలో ఆలయం



సీటీఎం నలవీర గంగమ్మ ఆలయం